


# ఎగ్జిబిషన్

కొల్లను వేంకట దుర్గాప్రసాద్

ఆ రోజు ఆదివారం కావడం మూలాన జనంతో కిటకిట లాడిపోతోంది ఎగ్జిబిషన్. అంతకుముందు ఆ వూళ్లో అంతపెద్ద ఎగ్జిబిషన్ ఎప్పుడూ పెట్ట లేదు. అన్ని స్టాల్సూ అందంగా అద్భుతంగా సినిమాలో ఖరీదైన సెట్టు వేసినట్టు వున్నాయ్. రంగు రంగు దీపాలతో, వెలిగి ఆరిపోతూ జిగేల్ మనిపిస్తున్నాయ్. ప్రతి స్టాలులోను సేల్సు గరల్సు వుండడంతో ఇక అందంగా ఉండమంటే ఎందు కుండదు ఎగ్జిబిషన్?

స్టాల్సులో తెల్లని ట్యూబ్ లైట్ల వెలుగు మధ్య అమ్మాయిలు నుంచుని వచ్చిన జనానికి జవాబు చెప్పలేక సతమత మవుతున్నారు. జనం చూడడమే గానీ, ఏ వస్తువూ కొనడం లేదు. అప్పుడప్పుడు ఈలలు, కేకలు, నవ్వులు, జోకులు (?) ఖరీదు అడగడం......

చాలా గంద్రగోళంగా వుంది ఎగ్జిబిషన్.

కనకారావు, మీనాక్షి మెల్లిగా నడుస్తూ ప్రతి స్టాలూ చూస్తున్నారు. వాళ్లకి ఏవీ కొన బుద్ధేయడం లేదు. ప్రతి స్టాలులోకి వెళ్లడం, చూడడం 'వస్తువులన్నీ మామూలు బజారు షాపులో వుండే వస్తువులకన్న ఖరీదు ఎక్కువగా వున్నాయి' అనుకోవడం చేస్తున్నా రిద్దరూ.

సిగరెట్ కంపెనీ స్టాల్సులో వో ఇరవై ఐదేళ్ల స్త్రీ వుండడం, వంటకు పని కొచ్చే సామాగ్రి అమ్మేచోట వో పురుషు డుండడం చూసి నవ్వుకున్నాడు కనకారావు.

'ఏం నవ్వుతున్నారు ?' మీనాక్షి అడిగింది.

చెప్పాడతను. మీనాక్షి కూడా నవ్వ ఆపుకోలేకపోయింది.

రోల్డుగోల్డు షాపుకి వచ్చారు. అక్కడొక నెక్లెస్ మీనాక్షిని ఆకర్షించింది.

'అది బావుంది కదూ?' కనకారావుకి చూపించింది.

'మోడల్ బావుంది ... కావాలా?' కనకారావు మీనాక్షి కళ్లల్లోకి చూసి ప్రేమగా అన్నాడు.

'మోడల్ నువ్వ కూడా గుర్తుపెట్టుకో ...బంగారంది చేయించుకుందువు గాని' అన్నాడు కనకారావు మళ్లా.

ఆమె తృప్తిగా నవ్వింది.

మీనాక్షి కోరికలు తీర్చడావే కనకారావు శ్యేయం.

ఇద్దరూ చాలాసేపు తిరిగారు.

'కాళ్ళు నెప్పెడుతున్నాయి' మీనాక్షి అంది.

'స్కూటర్ని లోపలికి తీసుకురానివ్వరు ...లేకపోతే చాలా రవుండ్లు కొట్టే వాళ్ళం...' కనకారావు అన్నాడు.

మీనాక్షి ఈసారి ఇంకా నవ్వింది.

'కాసేపు ఎక్కడేనా కూర్చుందాం...' మీనాక్షి బాధ గుర్తుంచుకొని అన్నాడు.

'ఆ కూల్‌డ్రింక్ షాపులో కూర్చుందాం పదండి!'

ఇద్దరూ అక్కడికి నడిచారు. చెరో డ్రింకూ పుచ్చుకున్నారు.

మీనాక్షికి నడక ఎక్కువ అలవాటు లేదు కదూ?...అందుకే కాళ్ళు నెప్పి పెట్టాయి ... అనుకున్నాడు కనకారావు, డ్రింకు తాగుతూ.

డబ్బులు చెల్లించాడు కనకారావు.

మీనాక్షి ఆటువేపు ఎటో చూస్తోంది.

కాసేపు విశ్రాంతి తీసుకొని లేవనీ అప్పుడే బయలుదేరడం ఎందుకు, అనుకుంటూ మరో ప్రక్క జనాన్ని చూడ డంలో మునిగిపోయాడు కనకారావు.

'హలో మురళీ!'

కనకారావు ఆశ్చర్యపోతూ మీనాక్షివంక చూసాడు. ఆమె ఎవర్నో దూరంగా వున్న

# ఎగ్జిబిషన్

మనిషిని చూసి కేక వేస్తోంది.

మురళి అనే అతను కాస్త వెరుగ్గా దగ్గరికొచ్చాడు. మీనాక్షి కూర్చున్నదల్లా లేచింది.

'నువ్వో కాదో అనుకున్నాను. అయినా నువ్వు ఏం మారలేదు. అంచేత గుర్తు పట్టగలిగాను త్వరగా.' హాయిగా నవ్వింది మీనాక్షి. మురళి మాట్లాడలేదు.

మురళికి పాతికేళ్ళు దాటాయి. అయినా మీనాక్షివంక ధైర్యంగా చూడలేక పోతున్నాడు.

'వీరు మావారు'...ఇతను నా క్లాసు మేటండీ!' పరిచయం చేసింది మీనాక్షి.

'నమస్కారమండీ!' మురళి నమస్క రించాడు.

'గ్లాడ్ టు మీట్యూ' అని చెయ్యి ముందుకు చాచబోయి, మురళి నమస్క రించడంతో తనూ నమస్కరించి వూరు కున్నాడు కనకారావు.

'అబ్బ! నీలో కొద్దిగకూడా మార్పు లేదు మురళీ' మీనాక్షి సంతోషంతో వూగి పోతున్నట్టు మాట్లాడుతోంది. అది కనకారావు గమనించాడు.

మురళి తలొంచుకొని నవ్వాడు.

'ఇప్పుడెక్కడుంటున్నావ్? ఏం చేస్తు న్నావ్...పెళ్ళయిందా?...'ప్రశ్నలు కురి పించింది.

'వైజాగ్ ఇన్‌కంటాక్సు ఆఫీసులో యూడిసిగా చేస్తున్నాను.

'పెళ్ళయిందా అంటే చెప్పవేం?'

'లేదు.'

'మీ అమ్మవాళ్ళంతా బావున్నారా?'

'బావున్నారు.'

'అబ్బ!... దాదాపు ఆరేళ్ళవుతోంది కదూ మనం...'

'ఎక్స్యూజమి... నేనిప్పుడే వస్తాను' కనకారావు అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

'ఎక్కడికి వెళ్ళటం' మీనాక్షి అడిగింది.

కనకారావు జవాబు చెప్పకుండా మీనాక్షి వంక చూసాడు.

'నే వెళ్తాను' మురళి కదిలాడు.

'ఏయ్ నువ్వెక్కడికి వెళ్ళడం!' చాలా కాలానికి కనపడి అప్పుడే వెళతానంటా వేం?' మీనాక్షి మందలించింది.

మురళి ఆగాడు.

కనకారావు కదిలాడు.

'ఆయనకు బోరు కొట్టినట్టుంది!' నవ్వింది మీనాక్షి.

'నువ్వేం, నీకేకేం' కాసేపాగి అంది మీనాక్షి.

ఇద్దరూ కూల్‌డ్రింక్‌షాపు బయటికి కొచ్చారు. డ్రింక్ షాపులో కొందమంది పిల్లని చూసి ఏదో కథ లనుకున్నారు.

బయట జనం గప్పుగా వచ్చినట్టు తిరుగుతున్నారు.

'ఇవాళ ఎగ్జిబిషన్‌కి రావడం ఎంత మంచిదైంది. ఎందుకు గొడవ ఎగ్జిబిషన్‌కి వెళ్ళడం... మనకేం వుంటుందక్కడ అని వూరు కున్నాను. మావారు వెళ్దాం వెళ్దాం అంటుంటే. వైజాగ్ నుంచి ఎప్పు డొచ్చావ్? ఇక్కడెక్కడికి వచ్చావ్? ఊళ్ళో ఎవరున్నారు నీకు...నాకు, కాస్త బలహీనంగా కనిపిస్తున్నావ్? కదూ...ఏమిటో అన్నీ నేనే మాట్లాడు తున్నాను ... నువ్వేం ముక్కకూడా మాట్లాడం లేదు

'ఏం మాట్లాడను' మురళి మాట్లా డాడు.

'అప్పుడు ముక్కగా మాట్లాడలేవు' నవ్వింది 'ఇవాళ నాకెంత సంతోషంగా



ఫ్రెండ్ తెల్సా' అంది.

మురళి మాట్లాడలేదు.

'ఎందుకని అడగవేం?' మీనాక్షి అంది.

'ఎందుకు?'

'నువ్వు కనపడ్డందుకు. నిన్ను ఈ జీవితంలో చూడగలనో లేదో అనుకునే దాన్ని. ఆ రోజు నువ్వు నాతో చెప్పకుండా మీ వూరెందుకు వెళ్ళిపోయావ్?...పలకవేం?'... ఆరోజు నీమీద చాలా కోపం వచ్చింది మురళీ...నీమీద మమత పెంచుకున్నాను. ఆశపడ్డాను. దయచేసి నీ దాన్నిగా చేసుకో మురళీ అని అడిగాను.

'నీకిష్టం లేదని వెంటనే చెప్తే రెండ్రోజులు బాధపడి వూరుకునే దాన్ని... మీనాక్షీ, నువ్వు గొప్పింటి బిడ్డవు... మీ అంతస్తు వేరు...నా అంతస్తు వేరు... నన్ను క్షమించు...అని చీటీముక్క రాసేసి వెళ్ళిపోతావా?'

మురళి పెదాలు వణికాయి. ఆమె వంక చూసాడు. అతని కళ్ళలో తిరుగుతున్న నీళ్ళని లైట్ల వెలుగులో గమనించింది మీనాక్షి.

నువ్వు ఈ లోకంలో బతకలేవు మురళీ...ఒట్టి అమాయకుడివి...పిరికివి... చాలా మంచివాడివి ... అందుకే నువ్వు ముందుకెళ్ళలేవు... నువ్వు బియ్యే చదివి గుమాస్తా చేస్తున్నావు ... మా వారూ బియ్యే, కాని ఆయన గుమస్తా కాదు...

# ఎగ్జిబిషన్

ఓ పెద్ద కంపెనీకి మేనేజింగ్ డైరెక్టరు...

'ఏమిటో ఇందాకట్నుంచి నేనే వాగుతున్నాను. నువ్వుమాత్రం నోరు మెదపడంలేదు. అందుకే నువ్వు బాగుపడలేవు.'

'మీ వారేరి?...' మురళి అటూ ఇటూ చూస్తూ అన్నాడు.


'వెరిగుడ్...ఇప్పుడైనా ఓ ప్రశ్న వేయగలిగావు...

'అలా వెళ్ళిపోయారేం ... ఆయన ఏమన్నా అనుకుంటారేమో.'

'అదిగో! ... అదే వద్దనేది...ఎందుకలా భయపడతావు... ఇప్పుడు మనం చేస్తున్న కానిపని ఏమిటి? మనసులోనే ప్రేమ దాచుకొని కుళ్ళిపోవడం నాకిష్టంలేదు. ఆయన ఏమైనా అనుకోని... నీతో మాట్లాడలేకుండా వుండలేను... కనపడినప్పుడు.'

'అందరూ మనల్నే చూస్తున్నారు!' సిగ్గుగా అన్నాడు.

'ఏమిటనుకునేది? ఇప్పుడేమయింది వాళ్ళు చూస్తే. మొగుడూ పెళ్ళాం అనుకుంటారు...లేపోతే అన్నాచెల్లెళ్ళు అనుకుంటారు ...లక్షమంది లక్షరకాలుగా అనుకుంటారు ... 'మీరిద్దరూ ఎవరూ?'




అని మనల్నొచ్చి ఎవరూ అడగరు గదా?

'అయినా మీవారిని వదిలి మనం ఇలా మాట్లాడుకోడం నాకు బాగా లేదు.'

'మీరెళ్ళండి...మేం ఇద్దరం నీ(కెట్ను) మాట్లాడుకోవాలి అని నేనన్నానా?... ఆయనక్కే ఆయనే వెళ్ళారు... దానికి నేనేం జేయను?'

'నీతో మాట్లాడం కష్టం మీనాక్షి!'

తృప్తిగా కళ్ళుమూసింది మీనాక్షి.

'ఎంతసేపటికి పిరికివాడివే మురళీ. ఆ రోజుల్లో అలాగే పిరికివాడివి... నామీద నీకు ప్రేముందని తెలుసు. కాని చెప్పవా సంగతి. నువ్వు సిందు కుండవు. కొంతమంది మనుష్యులంతేలే' తనకి ఎదుటి మనిషిమీద చచ్చేంత ప్రేమున్నా చెప్పుకోరుగాని, ఎదుటి మనిషి తనంతట పడి చావాలని మాత్రం అనుకుంటారు.'

మురళి వింటూ వుండిపోయాడు.

'ఇంకా ఇక్కడ ఎన్నిరోజు లుంటావ్?' అడిగింది.

'రేపు వెళ్ళిపోతాను'

'అదేం? ఎక్కువ రోజులు సెలవు పెట్టలేదా లేక శలవులేదా?'

'సెలవుంది...కానీ...'

'నీకు బిడియం భయం...ఇహ సెలవు ఎలా ఇస్తారు? నామాట విని వో నాల్రోజులు ఎక్స్టెండ్ చేయ్.'

'కుదరదు మీనాక్షి!'

'భలేవాడివి... మా ఇంటికి రాకుండా; భోంచేయకుండా వెళతావా ఏం?'

కనకారావు అప్పుడే వచ్చాడు.

'ఎక్కడికెళ్ళారు చాలా సేపయింది?' అడిగింది.

కనకారావు మాట్లాడ లేదు. ఐదు నిముషాలు గడిచాయి. ఎవరూ మాట్లాడుకో లేదు — మీనాక్షి మురళిని రెండు మూడు ప్రశ్నలు వేయడం తప్ప.

'మీరిద్దరూ మాట్లాడు కోరేం?' నవ్వింది ... కనకారావు అతనితో మాట్లాడనందుకు ఆశ్చర్యపోయింది.

అలా నుంచుండి పోయాడు మరి కాసేపు.

'ఇక నే వస్తాను ... వస్తానండి...' మురళి కదిలాడు.

'ఇదిగో మురళీ, రేపు తప్పకుండా

భోజనానికి రా...ఏమండీ ... అతనికి మన అడ్రసివ్వండి...'

'రేపు నే నుండను'

'చెబితే వినవేం ... రేపు వెళ్ళకపోతే కొంపలేం మునగవులే...'

'లేదు. కుదరదు...' గొణిగాడు.

'సరే. ఏంచేస్తాం ...' కనకారావు వంక చూసింది.

మురళి వెళ్ళిపోయాడు.

'ఎక్కడికెళ్ళా రింతసేపూ?' మీనాక్షి అడిగింది.

'ఎక్కడి కెళ్ళలేదు' ఎటో చూస్తూ అన్నాడు.

'ఎందుకలా మధ్యలో వెళ్ళిపోవడం ? కాసేపు మాట్లాడతారనుకున్నాను ...'

'మీ ఇద్దరిమధ్యా నే నెందుకులే అనుకొని వెళ్ళిపోయాను.'

'అంటే?'

'నీ క్లాసుమేటు కదా, కాసేపు...'

'మేమంత సీక్రెట్ పనులు చేసే వాళ్ళంకాదులెండి...బోళా మనుషులం...'

ఇద్దరూ అక్కడ్నించి కదిలారు.

'అయితే నన్ను చూడలేదన్న మాట' కనకారావు అన్నాడు.

అతనిమాట అర్థంకాలేదు మీనాక్షికి.

'అంటే ?'

'నీ కెదురుగా కాస్త దూరంలో నుంచుని మీ ఇద్దర్నీ చూస్తూనే వున్నాను...'

'పరాయి వాళ్ళలా అంతదూరంలో నుంచుని చూడడం ఎందుకు ?'

'మొదట నువ్వతన్ని ప్రేమించేవా?...' మనసులో వున్నది అడిగాడు.

'ఏం అలా అడిగారు ?'

'ఏం లేదు...అతన్ని చూడగానే ఏదో నిధి దొరికినట్టు సంతోషపడితేనూ ...'

'అవును ప్రేమించేను'

'మరింకేం ?'

'వూఁ...ఏమయిం దిప్పుడు?'

'నేను ఎదురుగుండా వుండి అన్నీ చూసేను ... అతనితో ఒకటే నవ్వుతో మాట్లాడ్డం...'

'అదేమన్నా తప్పా ?'

'తప్పని ఎలా అనుకుంటావులే...'

'నా కలా మాట్లాడితే బాగుండదు ... ప్లెయిన్‌గా మాట్లాడండి'

'అవును. ఇంతకాలం నువ్వు చాలా ప్లెయిన్‌గా వున్నట్టు. అత నెందుకు అలా దొంగలా భయపడతాడు ?'

'అది దొంగతనం కాదు...అది మంచి తనం'

'అబ్బో! మంచి !! ... అతన్ని వెనకేసుకు రావడం నాకు బాగోలేదు,' చిరాగ్గా అన్నాడు.




'అతన్ని మంచివాణ్ని అవమానిస్తే నాకు బాగోదు'

'బాగోదు ... బాగోదు ... ఎందుకలా వాడ్ని వెనకేసుకొస్తావ్? కాలేజీలో చదివేప్పుడు వాడ్ని అమితంగా ప్రేమించి వుంటావు ... కాపోతే వాడ్ని చూస్తే నీ కెందుకంత సంతోషం...వాడి కెందు కంతభయం...వాడితో కులికిపుంటావు...'

'ఛీ ఛీ. మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలియడం లేదులా వుంది. మీమనసు ఇప్పుడు బాగా అర్థమయింది...'

'చెప్తున్నాను వినండి...అతన్ని నేను ప్రేమించేను. పెళ్లి చేసుకోమని అడిగాను. కానీ అతను మా అంతస్తు చూసి భయపడ్డాడు. నేను తగానేను అను కున్నాడు...అలా విడిపోయాం... అనుకో కుండా అతను నావైపు ఇక్కడ కలిశాడు. అతన్ని చూసినా చూడనట్టు నేను నటించేను. నా ప్రేమను దాచుకొనేను.

# ఎగ్జిబిషన్

అందుకే మాట్లాడను...ఒకటి గుర్తుంచుకోండి... నేను కాని పని ఏం చేయడం లేదు...'

కనకారావు ఆవేశం తగ్గింది.

ఇద్దరూ మాట్లాడుకోడం మానేశారు. యాంత్రికంగా కదులుతున్నారు. హఠాత్తుగా కనకారావు వోచోట ఆగి పోయాడు. అతనితో పాటు మీనాక్షి ఆగి పోయింది.

సెకన్లు గడిచాయి. కనకారావు మీనాక్షివంక చూసాడు. మీనాక్షి కనకా రావు వంక చూసింది.

కనకారావు కంఠంలోంచి సంతోషంగా మాటలు వచ్చాయి 'హలో రాధా!' అని.

జనంలో రాధ ఆశ్చర్యంగా కనకారావు వంక చూసింది. ఆమె ప్రక్క మరో ఇద్దరాడవాళ్లూ, ఇద్దరు పిల్లలూ వున్నారు.

మీనాక్షి కనకారావు ప్రక్కనే వుంచుంది. కనకారావు మీనాక్షిని పరిచయం చేశాడు. 'ఈమె నా శ్రీమతి మీనాక్షి...ఈమె రాధ...నాక్లాసుమేటు...'

'వూం రాధ?' కొంటెగా మనసులో అనుకుంది మీనాక్షి.

'నమస్కారమండి?' అంది రాధ.

'నమస్కారం' అంది మీనాక్షి.

కనకారావు మీనాక్షివంక ఇబ్బందిగా చూసేడు. మీనాక్షి గమనించింది. 'నా కాళ్లు నెప్పెడుతున్నాయి. మీరేవి అను కోనంటే ఆ స్టాలుదగ్గర కూర్చుంటావ్' నవ్వింది మీనాక్షి. వెంటనే అక్కడ్నించి కదిలింది.

నిముషాలు గడుస్తున్నాయి. కనకా రావు రాధ మాట్లాడుకుంటున్నారు.

కాసేపు రాధతో వచ్చిన ఆడవాళ్లతో మీనాక్షి కబుర్లు చెప్పింది.

'అంతేనండి? ... మమతను దాచు కోడం కష్టం...ఎవరో చూస్తారని,... ఏదో అనుకుంటారని మమతని దిగ మింగలేం...అది విషంతో సమానం' కనకా రావుతో అలా అందామనుకుంది మీనాక్షి.

కాసేపటికి కనకారావు మీనాక్షిదగ్గరి కొచ్చేడు.

'సారీ!' అన్నారు.

'ఫర్వాలేదు లెండి!' అంది.

'వస్తానండి!' రాధ అంది.

'మీరీ వూళ్లోనే వుంటున్నారా?' అడిగింది మీనాక్షి.

'లేదండి, మా బాబాయి గారింటికి వచ్చాం.'

'మీతో మాట్లాడలేదని ఏమీ అనుకో కండి...సాయంత్రం ఆరింటినించి ఒకటే తిరుగుతున్నాం. కాళ్లు నెప్పెట్టి మిమ్మల్ని వదిలి ఇక్కడ కూర్చున్నాను ... మీరు దయచేసి మా యింటికి రేపు భోజనానికి రావాలి...ఇప్పుడు చాలాసేపు మాట్లాడుకోవచ్చు...వస్తారు కదూ?... ఏం...వస్తానని చెప్పండి...'

రాధ కళ్లు కృతజ్ఞతా పూర్వకంగా మెరిశాయి. అలాగే 'వస్తానండి' అంది. కనకారావు మీనాక్షి చేతిని ప్రేమగా నొక్కాడు. ●


ఓం! ఓం! ఓం!



సుఖ జీవిత సేవ
"సిద్ధవైద్యమహిమ"
సిద్ధుల పాటిలోని కీర్తికి ఒక తార్కాణము
కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి గారి
'మేల్ మాయిల్ మందు'
(Regd)
దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి

తెల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దుర్లు, పొక్కులు, గజ్జి (చర్మసంబంధము) పొడలు గల చోట్లలో తిమ్మిర్లు, నాడిలో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పుపడి బొబ్బలు గలిగినా తెలియకుండుట, దుర్నీరు సర్వ అవయవములందు వ్యాపించి, రక్తముతో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) చేతివ్రేళ్లు ముడుచుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదము వంటి నల్లపు పుండ్లు ఏర్పడుట, కాలుచేతులు వ్రేళ్ళు తగ్గుట, ముక్కు సొట్టపడుట మొదలగు వినుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి చక్కని నివారిణి.

1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము రు. 12/- తపాల ఖర్చు రు. 3.00
8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు. 6/- తపాల ఖర్చు రు. 2/-

సిద్ధ డాక్టర్

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు
5/22, మేల్ మాయిల్ P.O., (N.A. Dt.)